క్లుప్తంగా

ఘనంగా ఆరాధనోత్సవం



ప్రసంగిస్తున్న పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్

పామిడి: పట్టణంలోని సీఎస్ఐ చనిక,లో ఆదివారం ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా న్న పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ క్రైస్తవులను ఉద్దేశించి ప్రసంగించారు. దేవుడు ఇచ్చిన వనరులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. చేసే పనిలో నమ్మకం పెంపొందించుకోవడమే మన మంచి నిర్వాహకత్వానికి నిదర్శనమన్నారు. డబ్బు, సమయం, ప్రతిభను సక్రమంగా ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో చర్చి సభ్యులు జకరయ్య, దేవదాసు, రవిరాజు, రత్నరాజు, అబ్రహాం, రాజు, మెర్సీ, పాస్టరమ్మ సువర్ణమ్మ, శాంతమ్మ, సోఫియా, డాక్టర్ కమల, ప్రిస్కిల్లా, చంద్రకళ, వాణి, రేచెల్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించండి



ఆటో డ్రైవర్లను హెచ్చరిస్తున్న ఎస్ఐ గౌస్‌బాషా

పెద్దపప్పూరు: ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని ఇన్‌చార్జి ఎస్ఐ గౌస్‌బాషా సూచించారు.ఆదివారం ఆయన మండల కేంద్రలో ఆటో, ద్విచక్రవాహనాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పరిమితికి మించి ప్రయాణికులను ఆటోల్లో ఎక్కించుకోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. అత్యాశకు పోయి ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడవద్దని ఆటో డ్రైవర్లను హెచ్చరించారు. కొందరు తమ పిల్లలపై మమకారంతో ద్విచక్ర వాహనం నడపడానికి ప్రోత్సహిస్తూ మురిసిపోతున్నారే కానీ.. ప్రమాదం సంభవిస్తే జీవితాంతం కుమిలిపోవాల్సి వస్తుందన్నారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుపడితే వాహన యజమానిపై కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ మహదేవ్, జమేదార్ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గరుగుచింతలపల్లిలో సీఐ పర్యటన

పుట్లూరు: మండలంలోని గరుగుచింతలపల్లిలో ఆదివారం పుట్లూరు సీఐ సుబ్రమణ్యం పర్యటించారు. గ్రామంలో శనివారం రాత్రి జరిగిన ఘర్షణ నేపథ్యంలో ఏర్పాటు చేసిన బందోబస్తును పరిశీలించారు. అనంతరం ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎలాంటి సమస్యలున్నా పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. అనంతరం గ్రామంలోని పరిస్థితులపై ఆరా తీశారు.

ఘర్షణపై కేసు నమోదు

పుట్లూరు మండలంలోని గరుగుచింతలపల్లిలో శనివారం రాత్రి జరిగిన ఘర్షణపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హేమాద్రి ఆదివారం తెలిపారు. ఇరువర్గాల ఫిర్యాదులను స్వీకరించి ఎనిమిది మందిపై కేసు నమోదు చేశామన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



తాడిపత్రిలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

గుత్తి/పామిడి/తాడిపత్రి: గుత్తిలో ఆదివారం ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవంతో పాటు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్(మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్) సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ సర్కిల్ వద్ద ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు వీరన్న, ఎంఈఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రవి, నాగరాజు, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు నగదాని సత్య పాల్గొన్నారు. అలాగే ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకురాలు సునీత వేరుగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవంతో పాటు మంద కృష్ణ మాదిగ జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పామిడి పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ ఆదివారం ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాయలసీమ జిల్లాల ప్రధాన కార్యదర్శి ఎంసీ సుంకన్న, మండల అధ్యక్షుడు లాలెప్ప, మాదిగ సమాజ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వంకరాజుకాలువ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే తాడిపత్రిలో అంబేద్కర్ సర్కిల్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం కేక్‌ను కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఎంఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు వైకే విశ్వనాథ్, ఎమ్మార్పీఎస్ నాయకుడు పి.కె.గంగరాజు తదితరులు పాల్గొన్నారు. పెద్దవడుగూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పెద్దపప్పూరు ఆదినారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి భూపతి తదితరులు పాల్గొన్నారు.

నీ చలువే రాజన్నా..



- తాడిపత్రి నియోజకవర్గ అభివృద్ధికి వైఎస్సార్ ఎనలేని సాయం
- నియోజకవర్గ స్వరూపాన్నే మార్చేసిన మహానేత
- రూ.2 వేల కోట్లతో ప్రాజెక్టులు, అభివృద్ధి పనులు



వైఎస్సార్ హయాంలో నిర్మించిన చాగల్లు ప్రాజెక్టు



తాడిపత్రి పట్టణంలో సిమెంట్ రోడ్డు

తాడిపత్రి రూరల్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తాడిపత్రిపై తనదైన ముద్ర వేసి రైతులు, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారు. జలయజ్ఞంలో భాగంగా ముఖ్యమంత్రిగా ఉన్న 2004–09 మధ్య కాలంలో దాదాపు రెండు వేల కోట్ల రూపాయలను ప్రాజెక్టులు, ఇతర అభివృద్ధి పనులకు మంజూరు చేయించారు. అప్పట్లో తాడిపత్రి పట్టణానికి వచ్చి పనులకు శంకుస్థాపన చేశారు. పెద్దపప్పూరు మండలం చీమలవాగుపల్లికి అల్లుడు కావడంతో తాడిపత్రి నియోజకవర్గానికి కృతజ్ఞతగా ఆ స్థాయిలో నిధులు మంజూరు చేశారని ప్రజలు ఆనందంగా చెబుతుంటారు. తాడిపత్రి పట్టణ, రూరల్ ప్రాంతాల్లో నీటి ఎద్దడి లేకపోవడం ముమ్మాటికీ వైఎస్సార్ చలువే. 2007లో జేసీ నాగిరెడ్డి పథకం కింద దాదాపు రూ.508 కోట్లను కేటాయించారు. సమీపంలోని వైఎస్సార్ జిల్లా రైల్వే కొండాపురం మండలం గండికోట ప్రాజెక్టు నుంచి అనంతపురం జిల్లాలోని ఏడు నియోజవర్గాల్లోని 514 గ్రామాలు, తాడిపత్రి, గుంతకల్లు మున్సిపాలిటీలకు తాగునీరు అందించే బృహత్ పథకమైన జేసీ నాగిరెడ్డి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. అలాగే తాడిపత్రి పట్టణంలో అండర్ డ్రైనేజీ ఏర్పాటుకు రూ.20 కోట్లు మంజూరు చేశారు. పట్టణమంతా సిమెంట్ రోడ్ల కోసం దాదాపు రూ.33 కోట్ల మంజూరు చేశారు. ప్రస్తుతం పట్టణమంతా సిమెంట్ రోడ్లు ఉన్నాయంటే.. అందుకు వైఎస్సార్ చలువే.

రోడ్ల విస్తరణకు కృషి

తాడిపత్రి– అనంతపురం డబుల్ లైన్ రోడ్డు విస్తరణ కోసం దాదాపు 55 కిలోమీటర్ల పనులకు అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కోట్లాది రూపాయల నిధులను మంజూరు చేశారు. పెద్దపప్పూరు మండలంతో పాటు తాడిపత్రి మండలానికి సాగు, తాగునీరు అందించడం, పుట్లూరు మండలానికి తాగునీరు అందించడానికి చాగల్లు, పెండేకల్లు రిజర్వాయర్‌కు శ్రీకారం చుట్టారు. పెద్దపప్పూరు మండలం చాగల్లు వద్ద పెన్నానదిపై రూ.244.05 కోట్లతో చాగల్లు రిజర్వాయర్, రూ.100 కోట్లపైగా నిధులతో పెండేకల్లు రిజర్వాయర్ పూర్తికి నిధులను మంజూరు చేశారు. చాగల్లు ప్రాజెక్టు వల్ల పరిసర గ్రామాల ప్రజలకు సాగునీరు, తాగునీరు అందుతోంది. తాడిపత్రి అవసరాల మేరకు పలుమార్లు చాగల్లు ద్వారా పెన్నానదికి నీటికి వదిలి ప్రజల దాహార్తి తీర్చారు. 1986లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు యాడికి కాలువకు శంకుస్థాన చేసి కొంత వరకు పనులు జరిగిన తరువాత నిలుపుదల చేశారు. దాదాపు 20 ఏళ్ల తరువాత, ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖరెడ్డి ప్రమాణ స్వీకారం చేయగానే యాడికి కాలువ పనులకు పెద్దవడుగూరు మండలం కదరగట్టుపల్లి వద్ద శంకుస్థాపన చేసి అవసరమైన నిధులను మంజూరు చేయించారు. 2019లో తాడిపత్రి ఎమ్మెల్యేగా పెద్దారెడ్డి గెలిచిన తరువాత యాడికి కాలువకు ట్రయల్ రన్ కింద నీటిని విడుదల చేయించారు. సమీపంలోని యల్లనూరు మండలంలో వందల కోట్ల రూపాయలను జలయజ్ఞం కింద మంజూరు చేయించారు. గాలేరు–నగరి ఎత్తిపోతల కింద దాదాపు రూ.1100 కోట్లతో మూడు ప్యాకేజీల కింద యల్లనూరు, గొడ్డుమర్రి తదితర చెరువుల మరమ్మతులు, పైప్ లైన్లు తదితర వాటి కోసం ఖర్చు చేశారు. మండలంలోని పలు చెరువులకు గండికోట ప్రాజెక్టు కింద నీటిని సమృద్ధిగా సరఫరా చేయడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. నీటి సరఫరా వల్ల బీడు భూములు పచ్చని పంటలుగా మారాయి. పండ్ల తోటలతో గ్రామాలు విరాజిల్లుతున్నాయి. భూగర్భ జాలాలు పెరిగి తాగు, సాగునీటికి కరువు తీరింది.

మొహర్రం నిర్వహణకు అనుమతి తప్పనిసరి



యాడికిలో నిర్వాహకులతో మాట్లాడుతున్న సీఐ నాగార్జున రెడ్డి

యాడికి: గ్రామాల్లో మొహర్రం ఉత్సవాలు నిర్వహించుకునేందుకు పోలీసులు అనుమతి తప్పకుండా తీసుకోవాలని యూపీఎస్ అప్‌గ్రేడ్ సీఐ నాగార్జునరెడ్డి సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం మండలంలోని చింతలాయపల్లె, కమలపాడు, వేములపాడు, యాడికి, రాయలచెరువు, తూట్రాళ్లపల్లె, లక్షుంపల్లె, కేశవరాయునిపేట, రామరాజుపల్లె, చందన గ్రామాల్లోని మకాన్ల ముజావర్లు, కమిటీ సభ్యులతో సీఐ సమావేశమయ్యారు. సీఐ మాట్లాడుతూ మొహర్రం ఉత్సవాల్లో ఎటువంటి అల్లర్లు, గొడవలు జరగకూడదన్నారు. పీర్ల ఉత్సవాల్లో పార్టీల కతీతంగా ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. పంతాలకు, పట్టింపులకు పోయి గొడవలు సృష్టిస్తే ఊరుకునేది లేదని, ఎంతటి వారైనా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. అల్లర్లు జరిగితే ఆయా మకాన్‌ల ముజా వర్లు, కమిటీ పెద్దలపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో పోలీసులు రామాంజనేయులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

యల్లనూరు: మండలంలోని తిరుమలాపురం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు ఆదివారం పుట్లూరు సీఐ సుబ్రహ్మణ్యం దాడులు చేశారు. ఈ సందర్భంగా కిషోర్‌కుమార్‌రెడ్డి నుంచి 17 మద్యం బాటిళ్లు, కాటమయ్య వద్ద నుంచి 25 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ



పి.కొత్తపల్లిలో పశువులకు గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించిన దృశ్యం

గార్లదిన్నె: పశువుల్లో 90 శాతం కచ్చితత్వంతో పేయి దూడల పుట్టుకను ఉద్దేశించి లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేయవచ్చునని డీఎల్‌డీఏ కార్యనిర్వహణ అధికారి డాక్టర్ సుధాకర్ అన్నారు. ఆదివారం మండలంలోని పి.కొత్తపల్లిలో ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పశువుల్లో కృత్రిమ గర్భధారణ కోసం రూ.1350 విలువ గల రెండు సూదులు రూ.850 సబ్సిడీతో కేవలం రూ.500కే వేస్తామన్నారు. రెండు సూదులు వేసిన పశువుల్లో గర్భధారణ రాకపోతే రూ.500 వెనక్కి ఇస్తామన్నారు. కుర్రదూడ పుడితే రూ.250 వెనక్కి ఇస్తామన్నారు.విదేశీ జాతులనే కాక స్వదేశీ జాతులైన గిర్, సాహివాల్, తార్ప ర్కార్ వంటి కావాల్సిన బ్రీడ్‌లను ఎంపిక చేసుకునే అవకాశం ఉందన్నారు. అనంతరం గ్రామంలో 39 పశువులకు గర్భకోశ వ్యాధుల నిపుణుడు డాక్టర్ సుధాకర్ గర్భకోశ పరీక్షలు నిర్వహించారు. నట్టల నివారణ మందులు తాపారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సహాయకులు డాక్టర్ సుధాకర్,యర్రగుంట్ల పశువైద్యాధికారి ఆంజనేయులు నాయక్, రైతులు పాల్గొన్నారు.

అమ్మవారిశాలల్లో ప్రత్యేక పూజలు



అలంకరణలో ముసలమ్మ తల్లి



కాశీ విశాలాక్షి

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని అమ్మవారి ఆలయాల్లో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో పూజలు చేశారు. అదే విధంగా ముసలమ్మ కట్టవద్ద వెలసిన ముసలమ్మ దేవాలయంలో, కాశీ విశాలాక్షి దేవాలయంలో భక్తులు ఉదయాన్నే అభిషేకాలు, కుంకుమ అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

కుందుర్పి: మామిడిలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించొచ్చని ఉద్యాన శాఖ అధికారి గౌషియా సూచించారు. ఆదివారం మండలంలోని ఎస్‌మల్లాపురంలో మామిడి తోటల్లో కొమ్మల కత్తిరింపుపైన, సేంద్రియ ఎరువుల వాడకం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ మామిడి రైతులు కోతల అనంతరం యాజమాన్య పద్ధతులు పాటిస్తూనే సేంద్రియ ఎరువులు వాడాలన్నారు. మామిడి చెట్ల కొమ్మల కత్తిరింపులో జాగ్రత్తలు పాటించాలని, గత ఏడాది కాత రాని మామిడి చెట్లను మాత్రమే కత్తిరించాలన్నారు.

నారాయణుడికి ప్రత్యేక పూజలు



అలంకరణలో శింగరబట్టు, గణపతి, అశ్వత్థ నారాయణుడు

పెద్దపప్పూరు: ఆషాడమాసం తొలి ఆదివారం సందర్భంగా చిన్నపప్పూరు గ్రామసమీపంలోని పెన్నానది ఒడ్డున వెలసిన అశ్వత్థ క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు శింగరబట్టు, గణపతి, అశ్వత్థ నారాయణుడు, శ్రీకృష్ణార్జునులు, సీతారాములు, నవగ్రహాలు, చక్రభీమలింగేశ్వరుడు, శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వాములను దర్శించుకున్నారు. కోర్కెలు నెరవేరిన భక్తులు స్వామికి పొంగల్లు నైవేద్యంగా పెట్టడంతో పాటు ముడుపులు, కానుకలు, తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ప్రధాన అర్చకులు బాలసుబ్రమణ్యశర్మ, సుధీర్‌కుమార్‌శర్మ, సునీల్‌కుమార్‌శర్మ స్థల పురాణాన్ని వివరించి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

యల్లనూరు: తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని తహసీల్దారు జయ ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రజలు సమస్యలపై అర్జీలిచ్చేందుకు వస్తారని, ఆ సమయంలో సంబంధిత అధికారులు ఉండాలన్నారు. అర్జీలకు తక్షణమే పరిష్కారం చూపాలన్నారు. గైర్హాజరైన అధికారులపై కలెక్టరుకు నివేదిక పంపుతామన్నారు.

రేపు కంటి వైద్య శిబిరం

పామిడి: పట్టణంలోని వాసవీ కళ్యాణ మండపంలో మంగళవారం స్థానిక లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రభుత్వ ఆయూష్ సీనియర్ వైద్యాధికారి నల్లపాటి తిరుపతినాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బెంగుళూరు శంకర కంటి ఆస్పత్రి సారథ్యంలో నిర్వహించే ఈ శిబిరానికి వచ్చే వారు ఆధార్ (లేదా) రేషన్ కార్డు జిరాక్స్, రెండు పాస్ ఫోటోలు తెచ్చుకోవాలన్నారు. కంటి వైద్యశిబిరాన్ని మండల, మండలేతర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వాహనాల తనిఖీ

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని అనంతపురం – తాడిపత్రి రహదారిపై ఆదివారం సాయంత్రం బీకేఎస్ పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా రికార్డులు దగ్గర ఉంచుకోవాలన్నారు. డ్రైవర్లు లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. అనంతరం రికార్డులు సరిగాలేని వాహనదారులకు జరిమానా విధించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వెండి హారతుల వితరణ



కోటంక సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి వెండి పంచ హారతులు వితరణ చేసిన భక్తులు

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి కింద సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఆదివారం అనంతపురరానికి చెందిన హేమంత్‌కుమార్, నాగలక్ష్మి దంపతులు రూ.61 వేలు విలువ చేసే 54 తులాల వెండి పంచ హారతలను వితరణ చేసినట్లు ప్రధాన అర్చకులు రామాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి దాతలను ఆశీర్వదించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు.

నేడు వాడవాడలా వైఎస్సార్ జయంతి

గుంతకల్లుటౌన్: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు సోమవారం ఉదయం 9:30 గంటలకు స్థానిక మెయిన్‌రోడ్డు వైఎస్సార్ సర్కిల్‌లో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు సుంకప్ప, మోహన్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వైఎస్సార్ జయంతి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో పలు సేవాకార్యక్రమాలు నిర్వహించనున్నామని, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని వారు కోరారు.

తాడిపత్రిటౌన్: పట్టణంలో వైఎస్ రాజశేఖరరెడ్డి సర్కిల్‌లో సోమవారం ఉదయం 8.30 గంటలకు వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఏపీ సీడ్స్ డెవలెప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కంచం రామ్మోహన్‌రెడ్డి ఆదివారం తెలిపారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని ఆయన కోరారు.

పామిడి: పట్టణంలోని వైఎస్ విగ్రహం వద్ద సోమవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించే దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను జయప్రదం చేయాలని ఆ పార్టీ పట్టణ, రూరల్ కన్వీనర్లు జోజోడే కుమార్, కే నారాయణరెడ్డి ఆదివారం తెలిపారు. స్థానిక వైఎస్ విగ్రహం వద్ద ఉదయం 9.30 గంటలకు వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. ఈసందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు చెప్పారు. పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు.

శింగనమల: మండల కేంద్రంలో సోమవారం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలకృష్ణ, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి ఆదివారం తెలిపారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద నున్న మహానేత వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తామన్నారు. ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు తరలిరావాలన్నారు.

గార్లదిన్నె: మండల కేంద్రంలో సోమవారం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చి వేడుకలు జయప్రదం చేయాలన్నారు.

బుక్కరాయసముద్రం: బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని ముసలమ్మ కట్ట వద్ద ఉన్న వైఎస్సార్ సర్కిల్‌లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం ఎదుట జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ భాస్కర్ ఆదివారం ఓ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైఎస్సార్‌సీపీ నేతలు ఆలూరు సాంబశివారెడ్డిని, వీరాంజినేయులు హాజరవుతారన్నారు. మండంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలన్నారు.

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించండి



గుంతకల్లులో సమస్యలు తెలుసుకుంటున్న విద్యార్థి సంఘం నాయకులు



శింగనమలలో విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న దృశ్యం



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ప్రభుత్వ డీఎన్‌టీ హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ పట్టణ ప్రధాన కార్యదర్శి వెంకటేష్ డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్ఎఫ్ఐ నాయకులు హాస్టల్‌ను సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ చార్జీలను విడుదల చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా కాస్మోటిక్ చార్జీలను పెంచాలన్నారు. సొంతభవనాలు నిర్మించాలని, నెలకోసారి మెడికల్ క్యాంప్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కిశోర్, జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

శింగనమల: శింగనమల, తరిమెలలో ఉన్న ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యప్రకాష్ డిమాండ్ చేశారు. ఆదివారం శింగనమలలోని ఎస్సీ బాలుర, బీసీ బాలుర వసతి గృహాల్లో విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ బాలుర వసతి గృహంలో భవనం దెబ్బతిన్నదని, మరమ్మతు చేయాలన్నారు. అలాగే విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

గుత్తి: పట్టణంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లను ఎస్ఎఫ్ఐ నాయకులు ఆదివారం పరిశీలించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు రమేష్ మాట్లాడుతూ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బాలాజీ, కృష్ణ, ఈశ్వర్, వినయ్, దన పాల్గొన్నారు.



గుంత చుట్టూ రక్షణగా రాళ్లు పేర్చిన దృశ్యం

పొంచి ఉన్న ప్రమాదం

యల్లనూరు: యల్లనూరు నుంచి సింహాద్రిపురం వెళ్లే ప్రధాన రహదారిపై పాతపల్లి సమీపంలో పెద్ద గుంత ఉంది. ఈ గుంత పక్కనే రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు కుంగిపోయింది. దీంతో ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. నిత్యం వందల వాహనాలు తిరుగుతుంటాయి. సింహాద్రిపురంలోని ఓ ప్రైవేట్ పాఠశాలకు ఐదారు గ్రామాలకు చెందిన విద్యార్థులు వస్తుంటారు. ప్రభుత్వ అధికారులు సైతం అదే దారిలో ప్రయాణాలు చేస్తుంటారు. అయినప్పటికీ ఏ ఒక్కరూ స్పందించిన పాపాన పోలేదు. ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.